4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
ఆదివారం 20 ఏప్రిల్ 2025
www.ntnews.com

# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# మనసున్న మారాజు కేసీఆర్



నారదాసు లక్ష్మణ్‌రావు
9849059562

**గుండె నిండా ఆత్మవిశ్వాసం, గురిపెట్టిన బాణాల్లాంటి చూపులు, మంత్రముగ్ధుల్ని చేసే మాటలు, మాట ఇస్తే తప్పని కమిట్‌మెంట్, కమిట్‌తైతే కాలాన్ని ధిక్కరించి, కల్లోలాన్ని అధిగమించి గమ్యాన్ని చేరే సాహసం, ఎత్తుగడల్లో కొత్త పోకడలు, మేధస్సులో మేరుశిఖరం, హృదయం కరుణ రసామృతం, నిత్య అధ్యయనశీలి, ఉద్యమ ధీశాలి... వీటన్నింటి మేలు కలయికతో మూర్తీభవించిన మానవతామూర్తి కేసీఆర్.**

ప్రపంచ ఉద్యమాల్లో తెలంగాణ ఉద్యమం ప్రత్యేకమైనది. ప్రజాభీష్టం, మద్దతు పుష్కలంగా ఉన్నప్పటికీ, ఉద్యమం న్యాయబద్ధమైనప్పటికీ, ఉద్యమానికి అనేక అవరోధాలు ఉన్న సందర్భంలో, ఉద్యమ నాయకత్వం వహించిన కేసీఆర్‌ది ఒక విలక్షణమైన, ధీరోదాత్తమైన వ్యక్తిత్వం కావడం వల్లనే అంత్యదశ వరకు కొనసాగిన కుట్రలను అంతమొందించి ఉద్యమాన్ని విజయతీరాలకు చేర్చగలిగారు. లౌల్యానికి లొంగేవాడైనా, భయపడి పారిపోయేవాడైనా ఉద్యమం మధ్యనే పుట్టి మునిగిపోయేది. నాయకత్వం స్థానంలో ఉన్న వ్యక్తి సామర్థ్యం, వ్యక్తిత్వం, సాహసమే జయాపజయాలను నిర్ణయించడం అనేక ఉద్యమాల్లో చూశాం. లెక్కలేనన్ని ఒడిదొడుకుల్ని దాటుకొని, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో ఆయన ఎత్తుగడలు, పోరాటపటిమ, సంచలనాత్మక నిర్ణయాలు వెరసి ఒక పరిణత రాజకీయ చతురత కీలకంగా పనిచేసిందని చెప్పవచ్చు.

**కేసీఆర్ నిరంతర ఆశావాది. నిరాశను కలలో కూడా దరిచేరనీయరు. తన అనుచరుల్లో కూడా నిరంతరం ఆశావహ దృక్పథాన్ని నింపుతూ భవిష్యత్తు పట్ల విశ్వాసాన్ని కలిగిస్తూ ప్రేరణ అందిస్తుంటారు. పిల్లలను కాపాడుకొనే తల్లి కోడి వలె తన క్యాడర్‌ను కాపాడుకుంటారు. డబ్బు సంపాదించడానికైతే రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం లేదని, అందుకు అనేక ఇతర మార్గాలున్నాయని, ప్రజాప్రతినిధిగా జనం చేత ఎన్నుకోబడి, సేవ చేసే భాగ్యాన్ని పొందడం గొప్ప అదృష్టమని తన క్యాడర్‌లో నైతికతను ప్రబోధించడం, నాయకుడిగా కేసీఆర్‌లో ఉన్న కొత్త కోణం!**

కేసీఆర్ గొప్ప వ్యూహకర్త. ఉద్యమం ముగిసి రాష్ట్రాన్ని సాధించుకున్న వెంటనే తమ పార్టీ ఉద్యమ నేపథ్యం స్థానంలో ఫక్తు రాజకీయ పార్టీగా రూపాంతరం చెందుతుందని ప్రకటించిన సాహసి. తాను సాధించిన తెలంగాణను, తన కలలకు అనుగుణంగా బంగారు తెలంగాణగా రూపొందించాలంటే రాజకీయంగా బలోపేతం కావాల్సిన ఆవశ్యకతను గుర్తించారు. రాజకీయ సుస్థిరత లేకుండా, రాష్ట్రాభివృద్ధి సాధ్యం కాదని భావించారు. అందుకు శత్రువును చావుదెబ్బ కొట్టే వ్యూహాలతో ఇతర క్యాడర్‌ను పార్టీలోకి ఆహ్వానించడం, తన విధానం అమలుకు కావలసిన సంపూర్ణ మద్దతు కోసం సంఖ్యాబలాన్ని పెంచుకోవడం సమకాలీన రాజకీయ నిర్ణయాలకు దర్పణం పడుతుంది. తెలంగాణ సుస్థిరతకు వ్యతిరేకంగా పావులు కదుపుతున్న చంద్రబాబు, అతని అనుచర వలసవాద తొత్తుల కుట్రలను గమనించిన పిదపనే కేసీఆర్ ఈ గడ్డపై ఇంకా ఆంధ్రా పార్టీల అవసరం ఉందా? అని ప్రశ్నిస్తూ, శత్రు శేషం లేకుండా చేయడమే తన లక్ష్యంగా బహిరంగ యుద్ధాన్ని ప్రకటించారు. ఇది కొందరు మేధావులని చెప్పుకొనేవారికి నచ్చకపోవచ్చు. ఉద్యమానికి వ్యతిరేకంగా పనిచేసిన వారిని పార్టీలోకి తీసుకోవడాన్ని వ్యతిరేకించవచ్చు. కానీ, చైనాలో విప్లవం విజయవంతమైన పిదప, బలమైన చైనాగా రూపొందించడానికి విప్లవానికి వ్యతిరేకంగా పనిచేసిన వారిని సైతం తమతో చేర్చుకున్నారు మావో. మేధావులు విమర్శించినా, ఆ నిర్ణయం సఫలమై అజేయమైన శక్తిగా చైనా ఆవిష్కృతమైంది. తెలంగాణ కూడా కొత్తగా ఊపిరి పోసుకున్న రాష్ట్రంగా, బాలారిష్టాలను ఎదుర్కొనే బేలగా కాకుండా, భారతదేశంలోనే నంబర్ వన్ స్టేట్‌గా నిలపాలన్న ఆకాంక్షతో పార్టీని బలోపేతం చేశారు కేసీఆర్. అందుకోసం కలిసివచ్చే రాజకీయ శక్తులను కలుపుకొంటూ, కలిసిరాని తెలంగాణ వ్యతిరేక శక్తులను ఏకాకులను చేస్తూ సాగిపోయారు.

అభివృద్ధి కాముకుడు కేసీఆర్. ఆయన అభివృద్ధి నమూనాలు సోషలిస్టిక్ అప్రోచ్‌తో కూడుకున్నవి. సామాజిక అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చే దిశగా ఆయన స్వయంగా రూపకల్పన చేసి, ప్రవేశపెట్టిన మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, ప్రత్యేక ఇండస్ట్రియల్ పాలసీ, నిరంతరాయ విద్యుత్తు, కేజీ టు పీజీ గురుకులాలు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, రైతులకు రుణమాఫీ, రైతుబంధు, రైతు బీమా, పింఛన్ల పెంపు, బీడీ కార్మికుల పింఛన్లు లాంటి పథకాలు, మెడికల్ కళాశాలలు, కాళేశ్వరం లాంటి భారీ నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణాలు.. విధ్వంసమైన తెలంగాణను విముక్తి వైపు పరుగులు తీయించాయి.

కేసీఆర్‌లో ఉన్న గొప్ప గుణం ఏమిటంటే.. ఎవరు ఆయన వద్దకు వచ్చినా ఆత్మీయంగా రిసీవ్ చేసుకోవడం, వారు చెప్పిన విషయాలు ఓపికగా వినడం, దానిలో ఉపయోగకరమైన విషయం ఏమున్నా గొప్పగా ప్రశంసిస్తూ ఇతరుల వద్ద ప్రస్తావించడం. అట్లా ఉద్యమకాలం నుంచి మొదలుకొని ఈనాటి వరకు అనేకులు ఆయనతో ఇంటరాక్ట్ అవుతుంటారు. 2014 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎందరో ఫేస్‌బుక్‌లో వ్యక్తపరిచిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోకుండా, ఒంటరి పోరుకు సిద్ధపడటం చూస్తే ప్రజాభిప్రాయానికి, శ్రేయోభిలాషుల అభిప్రాయాలకు ఎంతటి ప్రాధాన్యం ఇస్తారో అర్థమవుతుంది. ఉద్యమంలో కలిసి నడిచిన వారినెందరినో సలహాదారులుగా నియమించుకొని, వారిని పాలనలో భాగస్వాములను చేసి, విలువైన సలహాలు ఏమున్నా వాటిని ఆచరణలోకి తీసుకురావడం ఆయన ఆలోచనల సారళ్యతకు నిదర్శనం.






కేసీఆర్ గొప్ప మోటివేటర్! తాను చేపట్టబోయే ఏ కార్యక్రమాన్నైనా తన వాళ్ల మధ్య అత్యంత ప్రతిభావంతంగా ప్రవేశపెట్టి, దానిపట్ల అమితమైన ఆసక్తిని రేకెత్తించి, దానిలో భాగస్వాములం కాకుంటే ఏమి కోల్పోతామోనన్న ఉత్కంఠను రేకెత్తించి, దానిని విజయవంతం చేసి, అందరిని భాగస్వాములను చేసే నైపుణ్యం ఆయనకు ఉంది. ఉద్యమ సందర్భంలో రాజీనామాలు, సడక్ బంద్, వంటావార్పు, తెలంగాణ సంబురాలు, తెలంగాణ తల్లి విగ్రహాల ఏర్పాటు మొదలగు ఎన్నో సంచలనాత్మక నిర్ణయాలతో పాటు రాష్ట్రం ఏర్పడిన తర్వాత, ఏర్పాటు చేసిన ప్రజాప్రతినిధుల ఓరియంటేషన్ క్లాసుల వరకు ప్రతి కార్యక్రమాన్ని ముందుగా విస్తృత చర్చకు తెరలేపి, అందరిని మోటివేట్ చేసి, చివరకు ఘన విజయం సాధించేలా చేస్తారు.

**గొప్ప మానవతావాది కేసీఆర్! దళిత, గిరిజనులు, బడుగు బలహీనవర్గాల పట్ల ఆయనకు ఎనలేని మమకారం. అరవై ఏండ్ల సీమాంధ్ర పాలకుల వివక్షాపూరిత విధానాల ఫలితంగా అనేక తరాలు అంతులేని పేదరికంలో మగ్గిన పరిస్థితులను కండ్లారా చూసిన పిదప, తన ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యం ఆ వర్గాల అభివృద్ధేనని స్థిరీకరించుకున్నారు. పథకాల రూపకల్పన, నిధుల కేటాయింపుల్లో వారి అభ్యున్నతికి సింహభాగం కేటాయించారు. అనేక సమస్యలతో తనను వ్యక్తిగతంగా కలిసే వారి పట్ల కూడా కడు దయార్ద్ర హృదయంతో స్పందిస్తారు కేసీఆర్.**

ఒక్కసారి ఆయనను కలిసి, సాన్నిహిత్యంలో గడిపినవాళ్లు ఎప్పటికీ ఆయన ప్రేమానురాగాలను మరచిపోలేరు. ఆయనను విమర్శించడానికి పూనుకోరు. ఈ విషయాన్ని అనేకులు గతంలో చెప్పారు. ఈ మధ్యనే కేసీఆర్‌ను కలిసిన ఒక సీనియర్ జర్నలిస్ట్ కూడా నాతో ఈ విషయాన్ని గొప్పగా ప్రస్తావించారు. ఉత్పత్తి శక్తులతో పాటు, సేవారంగంలో ఉన్న వారిపట్ల అపారమైన ప్రేమను, మానవీయతను ప్రదర్శిస్తారు. ఉద్యోగులు, ఆర్టీసీ కార్మికులకు పీఆర్సీ ఇచ్చే సమయంలో, వారికి కడుపు నిండా ప్రయోజనం ఉండాలని వ్యాఖ్యానిస్తూ ఫిట్‌మెంట్ ప్రకటించడం ఆయనలో దాగి ఉన్న మానవీయ కోణానికి నిదర్శనం.

కేసీఆర్ గొప్ప చదువరి. విషయ గ్రాహకుడు. వేలాది పుస్తకాలు చదివిన జ్ఞానంతో ప్రతి విషయం పట్ల సాధికారతను సాధించగలిగారు. తెలంగాణ భాష, సంస్కృతి సాహిత్యం, కళల పట్ల అవగాహన మాత్రమే కాకుండా అవ్యాజమైన ప్రేమ కూడా ఉంది. తెలంగాణ ఉద్యమ సాఫల్యతలో ప్రజలకు ఆయనను చేరువ చేసింది భాష మీద ఆయనకున్న పట్టు. అంతేకాకుండా తెలంగాణ భావజాల వ్యాప్తిలో కీలక భూమిక పోషించిన కవులు, కళాకారుల పట్ల ఎనలేని గౌరవం, ప్రేమ. ఏ ప్రభుత్వం కనీసం ఆలోచనైనా చేయజాలని కళాకారులకు ఉద్యోగాల కల్పన.. వారి పట్ల గల ప్రత్యేక ప్రాధాన్యాన్ని తెలియజేస్తుంది. ఆంధ్రా పాలకుల పాలనలో విధ్వంసమైన తెలంగాణ భాష సంస్కృతుల పునరుద్ధరణ కోసం అనేక చర్యలు తీసుకున్నారంటే వాటి పట్ల ఆయనకు గల మక్కువ, ప్రాధాన్యాన్ని మనం గమనించివచ్చు.

కేసీఆర్ నిరాడంబరుడు, గొప్ప హాస్యచతురుడు. ఆయన ఆహార్యంతో పాటు మిగతా జీవనశైలి ఎంతో నిరాడంబరంగా ఉంటుంది. ఇంట్లో కుటుంబసభ్యుల మధ్యన, సన్నిహితుల మధ్యన, ...ధికారులతో చర్చల సందర్భంలో ఆత్మీ...యంగా, అనునయంగా ఉంటారు. ...ముఖ్యమంత్రినన్న డాబు, దర్పం ...నాడూ కనిపించదు. విధి నిర్వ...ణ, నిజాయతీ, సమయపా...లన పట్ల ఎంత ...ఠినంగా ఉంటారో, ...శానిర్దేశం చేసే సమ...యంలో అంత సానుకూలంగా ...వ్యవహరిస్తారు. చాలామందికి తెలి...యని ఆయనలోని మరో కోణం ...హాస్యచతురత. అనేక సందర్భాల్లో ...డుపునిండా, గలగలా ఆహ్లాదక...ంగా నవ్వడంలో ఆయన్ని మించి...వారు మరొకరు లేరంటే అతిశ...యోక్తి కాదు. ఆయన వ్యక్తిత్వంలో దాగిన భిన్న కోణాలను గమనిస్తే ఆశ్చర్యపోవడం మన వంతు అవుతుంది. ఆయనతో గడపడమే ఓ అధ్యయనం. ఆయనతో మాట్లాడటమే ఒక జ్ఞానం. ఆయన సాన్నిహిత్యం అమ్మ ఒడిలాంటి సాంత్వనా కేంద్రం. ఆయనతో కలిసి నడవడమంటే మహోన్నత తెలంగాణ చరిత్రలో ఒక పుటగా మిగిలిపోవడం!

**14 ఏండ్లుగా ఉద్యమ కేంద్రమైనవాడు, ప్రజల కష్టాలు చూసి కన్నీటిబొట్లు రాల్చినవాడు, వలస దోపిడీపై కత్తిదూసినవాడు, కాలాన్ని మార్చే కర్తవ్యాన్ని నిర్దేశించుకున్నవాడు, ఉడుకు నెత్తురుల చైతన్యాన్ని రగిలించినవాడు, ఉద్యమ శక్తుల్ని ఏకం చేసినవాడు, అంపశయ్యనెక్కి ఆశయాన్ని సజీవంగా నిలిపినవాడు, మరణం అంచుల దాకా వెళ్లి మన తెలంగాణ సాధించినవాడు, గడపగడపలో ఉద్యమ హారతులందుకున్నవాడు, గమ్యాన్ని ముద్దాడి ఘనకీర్తిని మూటగట్టుకున్నవాడు, ఉద్యమాలకే ఓనమాలు దిద్దినవాడు, పాలనకే పాఠాలు నేర్పినవాడు, పోరాటయోధుడే పాలకుడై ప్రజల కలలు పండించినవాడు కేసీఆర్.**

అందుకే ఈ 25 ఏండ్ల కాలాన్ని సమీక్షించుకోవడం, సంబురాలు చేసుకోవడంతో పాటు, సాధకుడి ఔన్నత్యాన్ని, త్యాగాన్ని, సామర్థ్యాన్ని గుర్తు చేసుకోవడం మన బాధ్యత. కేసీఆర్ దార్శనికత, నిబద్ధత, నిత్య పరిశ్రమపైనే తెలంగాణ అభివృద్ధి జరిగిందన్నది కాలం నిరూపిస్తున్న కఠోర సత్యం! తెలంగాణ సమాజం ఆయన ఆలోచనలకు ఆసరాగా నిలవాలి. నాయకత్వాన్ని బలపరచాలి. పదికాలాలు పచ్చగా ఉండాలని నిండు దీవెనలు ఇవ్వాలి! కేసీఆర్ క్షేమంగా ఉన్నంత కాలం తెలంగాణ సుభిక్షంగా ఉంటుంది. తెలంగాణ ఉన్నంత కాలం కేసీఆర్ కీర్తి అజరామరమై వర్ధిల్లుతుంది.

(వ్యాసకర్త: బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)

## భాషకు జీవం పోసిన కేసీఆర్



శతాబ్దాల తరబడి తెలంగాణ భాష వివక్షకు గురైంది. నన్నయ కాలం నుంచి మొదలుకొని 2014 వరకు తెలంగాణ భాష మనకు కాకుండాపోయింది. మన భాష, సంస్కృతి, చరిత్ర అణచివేతకు గురైంది. కాళోజీ, దాశరథి రంగాచార్యులు, అల్లం రాజయ్య, వేముల ఎల్లయ్య, భూతం ముత్యాలు వంటి రచయితలు తమ రచనల్లో తెలంగాణ భాషను వినియోగించినా తగిన ఆదరణ దక్కలేదు. తెలంగాణ భాషకు, సాహిత్యానికి పాఠ్య పుస్తకాల్లో చోటు లభించకపోవడమే అందుకు కారణం. స్వరాష్ట్రం ఏర్పడ్డాక తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మన భాష, యాస, సాహిత్యానికి పెద్దపీట వేశారు. పాఠశాల స్థాయి నుంచి కళాశాల వరకు పాఠ్య పుస్తకాల్లో తెలంగాణ పదాలు, సామెతలు, జాతీయాలను చేర్పించారు. అంతేగాక తనే స్వయంగా తెలంగాణ భాషలో మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను ఆకర్షించారు. నుడికారం, జాతీయాలు, సామెతలతో ఆయన మాట్లాడే భాషామాధుర్యాన్ని తెలంగాణ ప్రజలందరూ ఆస్వాదించారు.

కేసీఆర్ విద్యాభ్యాస కాలం అంతా ఉర్దూ, ఆంధ్రా భాషలో సాగినా ఆయనకు తెలంగాణ యాస మీద మక్కువ తగ్గలేదు. తెలంగాణ వెనుకబాటుతనాన్ని, భాషను హేళన చేయడాన్ని కళ్లారా చూసిన కేసీఆర్.. భాషను బతికించాలనే దృఢ సంకల్పంతో మన భాషపై పట్టు సాధించారు. 'బడి పలుకుల భాష గాదు.. పలుకుబడుల భాష కావాలె' అని నినదించిన కాళోజీ మాటల్ని నిజం చేయడానికి కేసీఆర్ పూనుకున్నారు. విజయం సాధించారు కూడా. వాక్చాతుర్యంతో, నుడికారంతో, భాషా నైపుణ్యంతో రాజకీయ ఉద్దండులను ఎదుర్కొన్నారు. తెలంగాణ ప్రజలకు దగ్గరయ్యారు.

సామాన్యుల నుంచి మేధావుల వరకు అందరికీ సులభంగా అర్థమయ్యేలా చమత్కారంతో, మాటతీరుతో, భాషా సౌందర్యంతో ఆకట్టుకున్నారు. పరిపాలనా రంగంలో ప్రత్యేకమైన మార్కును సృష్టించారు. తెలంగాణ ప్రజాప్రతినిధులు, నేతలు కేసీఆర్ మాట్లాడినట్టు తెలంగాణ భాషలో మాట్లాడాలి. ఆ దిశగా ప్రయత్నించాలి. భావితరాలకు తెలంగాణ భాషా సౌందర్యం, మాధుర్యాన్ని అందించే బాధ్యత మనందరిపై ఉందని గ్రహించాలి. తెలంగాణ భాషా సాహిత్యంపై మరిన్ని పరిశోధనలు జరిపి, భవిష్యత్తు తరాలవారికి అందించే ప్రయత్నం చేద్దాం.

-కాళేశ్వరం కృష్ణమూర్తి, 97051 96097

## నాయకత్వ సృష్టికర్త



**'సిపాయిల తిరుగుబాటు విఫలం అయ్యిందని అనుకుంటే వచ్చేదా దేశానికి స్వాతంత్ర్యం రాజీ లేని పోరాటమే విజయం సాధిస్తుంది ముమ్మాటికీ తెలంగాణ రాష్ట్రమొచ్చి తీరుతుంది'** అనే ప్రగాఢ విశ్వాసంతో ఆవిర్భవించిన బీఆర్‌ఎస్ ప్రయాణం ఎన్నో మలుపుల మధ్య సాగింది. తెలంగాణ అన్న పదమే వినపడకూడదని నిరంకుశ రాజ్యం నడుస్తున్న నిశీధిలో ఒక కాగడా వెలుగులా ప్రజాస్వామిక, పార్లమెంటరీ పద్ధతిలో తెలంగాణ ఏర్పాటు లక్ష్యంగా ఏర్పడిన బీఆర్‌ఎస్ ఒక కొత్త చరితను లిఖించింది.

తెలంగాణలో అప్పటిదాకా ఆట, పాట, మాటలన్నీ బంద్ అయినయ్. అలాంటి పరిస్థితుల్లో భావజాల వ్యాప్తికి, సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు, తెలంగాణ సమస్యల మీద పోరాడేందుకు బీఆర్‌ఎస్ ఒక వేదికగా మారింది. అప్పటికే ప్రజా ఉద్యమాల్లో ఉండి నిర్బంధానికి, అణచివేతకు గురవుతున్న యువతరానికి బీఆర్‌ఎస్ ఆసరాగా మారింది. అంతేకాదు, బీఆర్‌ఎస్ ఒక కొత్త రాజకీయ తరాన్ని సృష్టించింది. తెలంగాణ ఉద్యమ సందర్భం నుంచి నేటి వరకు వేలాది మంది నాయకులను తయారు చేసి, పాలనలో భాగస్వామ్యం కల్పించారు కేసీఆర్. అటెండర్‌గా ప్రస్థానం ప్రారంభించిన స్వామిగౌడ్, సింగరేణి కార్మికుడిగా ఉన్న కొప్పుల ఈశ్వర్, రైతు కుటుంబానికి చెందిన పద్మా దేవేందర్‌రెడ్డి, సునీతా మహేందర్‌రెడ్డి వంటివారు ప్రజాప్రతినిధులుగా చట్టసభల్లో అడుగుపెట్టడం బీఆర్‌ఎస్‌లోనే సాధ్యమైంది.

జర్నలిస్ట్‌గా ఉన్న రామలింగారెడ్డి, విద్యార్థి నేతలు బాల్క సుమన్, గాదరి కిశోర్, ఎర్రోళ్ల శ్రీనివాస్ లాంటివారు ప్రజాప్రతినిధులుగా ఎదిగారు. ఉద్యమ సమయంలోనైనా, అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజలే కేంద్రంగా పనిచేయాలనే గొప్ప ప్రజాస్వామిక విలువలను కేసీఆర్ వారిలో పెంపొందించారు. రాజకీయాలంటే పదవులే కాదని, ప్రజల ఆకాంక్షల ముందు పదవులన్నీ తృణప్రాయమేనని అనేక ఉప ఎన్నికల్లో కేసీఆర్ నిరూపించారు. బీఆర్‌ఎస్ తెలంగాణ ఇంటి పార్టీ.. కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని భావించిన ప్రజలు ఆ పార్టీని ప్రతీ సందర్భంలో కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నారు. తెలంగాణ సుభిక్షంగా ఉండాలన్నా, తెలంగాణలో మళ్లీ స్వర్ణయుగం రావాలన్నా బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం.

- మాదాసు శ్రీనివాస్

## తెలంగాణ భవిష్యత్తు బీఆర్‌ఎస్



రాచరిక పాలన నుంచి స్వతంత్ర భారత్ వరకు తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ప్రపంచంలో మరెక్కడా లేని విధంగా 1940వ దశకంలో మహోన్నత సాయుధ రైతాంగ పోరాటాన్ని నడిపిన చరిత్ర తెలంగాణ సమాజానిది. షేక్ బందగీ, దొడ్డి కొమురయ్యల అమరత్వం నేటికీ స్ఫూర్తిగా నిలిచిపోయింది. సాయుధ పోరాట విరమణ, హైదరాబాద్ సంస్థానం విలీనం, భాషా ప్రయుక్త రాష్ట్రాల పేరిట తెలంగాణను ఏపీలో కలపడంతో మళ్లీ తెలంగాణకు అన్యాయం జరిగింది.

అనేక ఉద్యమాలు జరిగినా తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ఆపలేకపోయాయి. పదవులపై ఉన్న మమకారంతో ప్రజల ఆకాంక్షలను తెలంగాణ నేతలు ఢిల్లీలో తాకట్టుపెట్టారు. ఈ నేపథ్యంలో స్వరాష్ట్రం కల సాకారమవ్వాలంటే పదవుల త్యాగం తప్పనిసరని భావించిన కేసీఆర్ డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామా చేసి, తెలంగాణ ఉద్యమ కాగడాను చేతబూని బయలుదేరారు. 2001 ఏప్రిల్ 27న టీఆర్‌ఎస్ పేరిట జనంలోకి వెళ్లారు. తెలంగాణ సాధనే ఏకైక ఎజెండాగా సుదీర్ఘ పోరాటం చేశారు. ఆర్‌ఎస్‌యూ నుంచి ఆర్‌ఎస్‌ఎస్ వరకు అందరూ ఒక్కటి కావాలని పిలుపునిచ్చారు. నిరసనలు, ఆందోళనలతో మహోన్నత ఉద్యమాన్ని నిర్మించారు. కేసీఆర్ అవిశ్రాంత పోరాటం, ప్రజల ఆకాంక్షలు ఫలించి స్వరాష్ట్రంగా తెలంగాణ ఏర్పడింది.

ఉద్యమ నాయకుడి చేతుల్లోనే పాలనాపగ్గాలు ఉండాలని భావించిన ప్రజలు కేసీఆర్‌కే పట్టం కట్టారు. ప్రజల కష్టాలను స్వయంగా చూసిన కేసీఆర్.. ఆ వెతలకు చరమగీతం పాడాలని నిశ్చయించుకున్నారు. అనేక విప్లవాత్మక పథకాలను రూపొందించి అమలుచేశారు. పదేండ్ల పాలనలో తెలంగాణను దేశానికే రోల్‌మోడల్‌గా నిలిపారు. తెలంగాణను సుస్థిర అభివృద్ధి వైపు నడిపించారు. తెలంగాణకు అనేక అవార్డులను తెచ్చిపెట్టాయి. ఉద్యమంలో పద్నాలుగేండ్లు, స్వయంపాలనలో పదేండ్లపాటు కేసీఆర్ నాయకత్వంలో ముందుకుసాగామని చెప్పేందుకు గర్వపడుతున్నా. నేడు మళ్లీ తెలంగాణ ప్రమాదంలో పడింది. తెలంగాణకు కేసీఆర్ నాయకత్వం అవసరమనే భావన ప్రజల్లో కలుగుతున్నది. కేంద్రంలో బీజేపీ వైఫల్యాలను ఎండగట్టాలన్నా, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజావ్యతిరేక పాలన నుంచి విముక్తి కలగాలన్నా కేసీఆర్‌తోనే సాధ్యం. బీఆర్‌ఎస్ 25 వసంతాల పండగ సందర్భంగా కేసీఆర్ నాయకత్వాన్ని మరోసారి బలపరుద్దాం! భవిష్యత్ తెలంగాణను సంరక్షించుకుందాం!

-నాయినేని రాజేశ్వరరావు, 94902 01066



## 'ఇంద్రవెల్లి'ని పాఠ్యాంశాల్లో చేర్చాలి

**ఏప్రిల్ 20వ తేదీ ఆదివాసీ పోరాట చరిత్రలో మరువలేని జ్ఞాపకం. దేశ స్వాతంత్ర్యానికి ముందు నైజాం పాలనలో జోడే ఘాట్ కేంద్రంగా సాగిన కుమ్రం భీం భూపోరాటానికి కొనసాగింపుగా జరిగిన ఇంద్రవెల్లి గోండు రైతుల ఉద్యమానికి 44 ఏండ్లు నిండాయి. ఈ సందర్భంగా గోండు రైతులకు జోహార్లు అర్పిస్తూ వారి పోరాటాన్ని మననం చేసుకోవాల్సిన అవసరం ఉంది.**

1970వ దశకం చివరలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఆదివాసీలు భూమి పట్టాలు, శిస్తు వసూలు తదితర సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీరికి గిరిజన రైతుకూలీ సంఘం ఒక దిక్సూచిగా మారింది. అప్పటికే పోరాటాలు చేస్తున్న ఆ సంఘంలో గోండు, కోలాం, కోయ తెగల రైతులు చేరారు. పోడు పట్టాలు, షావుకారుల వడ్డీ వ్యాపారంలో మోసాలు తదితర అంశాలపై 1981 ఏప్రిల్ 20న ఇంద్రవెల్లిలో గిరిజన రైతుకూలీ సంఘం మహాసభలను నిర్వహించి, భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకోవాలని భావించారు. సభకు మొదట అనుమతి ఇచ్చి, ఆ తర్వాత సభ జరిగే రోజు అనుమతిని రద్దు చేశారు. 144 సెక్షన్ విధించారు. అనుమతి రద్దయిన విషయం తెలియక జిల్లావ్యాప్తంగా ఉన్న ఆదివాసీలు పెద్ద సంఖ్యలో ఇంద్రవెల్లికి చేరుకున్నారు. అక్కడ మాటు వేసిన పోలీసులు విచక్షణారహితంగా వారిపై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో 17 మంది మరణించారు. వందల మందిని అరెస్టు చేశారు. జలియన్ వాలాబాగ్ హత్యాకాండను పోలిన ఈ దుర్ఘటన చరిత్రలో నిలిచిపోయింది. ఈ చరిత్రను భవిష్యత్తు తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉన్నది. ఈ నేపథ్యంలో ఇంద్రవెల్లి పోరాట గాథను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని ఆదివాసీ విద్యార్థి సంఘం డిమాండ్ చేస్తున్నది.

**నేటికీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీలు నిర్లక్ష్యానికి గురవుతున్నారు. గూడాలలో విద్య, వైద్యం, తాగునీటి సరఫరా లేదు. ఆసిఫాబాద్ జిల్లాలో 46 గ్రామాలకు, మంచిర్యాల జిల్లాలో 25 గ్రామాలకు, నిర్మల్ జిల్లాలో 12 గ్రామాలకు, ఆదిలాబాద్ జిల్లాలో 56 గ్రామాలకు కనీస రోడ్డు సౌకర్యం లేదు. ఈ జిల్లాల్లో విద్య, వైద్య సదుపాయాలు అంతంతమాత్రమే.**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు ఉండరు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేరు. ఇటీవల కాలంలో ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కరువై విద్యార్థులు చనిపోతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఏడాది 10 మంది విద్యార్థులు చనిపోయారు. ఐటీడీఏలు భూస్వాములు, ఆదివాసేతరుల సేవలో మునిగి తేలుతున్నాయి. అటవీ ప్రాంతాల్లో ఉన్న నాన్ ఏజెన్సీ గ్రామాలను ఏజెన్సీ గ్రామాలుగా గుర్తించడం లేదు. కేంద్ర, రాష్ట్ర పాలకులు ఆర్థిక రాజకీయ ప్రయోజనాల కోసం పెట్టుబడిదారులతో కలిసిపోయారు. ఏజెన్సీలోని సహజ వనరులను దోచుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇంద్రవెల్లిలో దళిత, గిరిజన దండోరా పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ఆదివాసీలకు అనేక హామీలిచ్చింది. కానీ, వాటిలో ఏ ఒక్కటీ అమలుకు నోచుకోలేదు. నాడు ఇంద్రవెల్లిలో జరిగిన హత్యాకాండ నేడూ వివిధ రూపాల్లో కొనసాగుతున్నది. పాలకుల విధానాలతో ఆదివాసీలు అంతరించిపోయే ప్రమాదం ఏర్పడింది. ఇలాంటి సందర్భంలో ప్రజలు ఇంద్రవెల్లి రైతాంగ ఉద్యమాన్ని గుర్తుచేసుకోవడం ఎంతో అవసరం.


- సిడం జంగుదేవ్, రాష్ట్ర అధ్యక్షులు, ఆదివాసీ విద్యార్థి సంఘం

# మోదీ పాలనలో దేశం తిరోగమనం

**పదేండ్ల మోదీ పాలనలో దేశం 30 ఏండ్లు వెనక్కి వెళ్లింది. దేశంలో నిరుద్యోగ రేటు 45 ఏండ్ల గరిష్ఠ స్థాయికి చేరింది. జీడీపీ 8 శాతానికి పెరిగిందని గొప్పలు చెప్పుకొంటున్న మోదీ అందుకు తగ్గట్టుగా ఉపాధి అవకాశాలు ఎందుకు పెరగడం లేదో సమాధానం చెప్పాలి. దేశ జనాభాలో యువత 83 శాతం ఉన్నారు. అధికారంలోకి రాకముందు ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన మోదీ... కనీసం కేంద్రప్రభుత్వంలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న 10 లక్షల పోస్టుల్ని అయినా భర్తీ చేయకుండా నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్నారు. మరోవైపు రిజర్వేషన్లు అమలు చేయకుండా ఉండటానికి ప్రభుత్వరంగ సంస్థల్ని ప్రైవేట్‌పరం చేస్తున్నారు. గత పదేండ్లలో మూడున్నర లక్షల ఉద్యోగాల్ని ప్రభుత్వరంగ సంస్థల్లో రద్దు చేశారు. ప్రభుత్వ రంగంలోని సంస్థల్లో కాంట్రాక్టు ఉద్యోగుల శాతం 88కి పెరిగింది.**



డాక్టర్ బండారు నరేందర్‌రావు



మరోవైపు సామాన్యులు పొదుపు చేయలేనంతగా ద్రవ్యోల్బణం పెరిగింది. 40 శాతం సంపద దేశంలోని ఒక శాతం జనాభా దగ్గరే కేంద్రీకృతమైంది. ప్రజాస్వామ్య దేశంలో ఇలా సంపద ఒక దగ్గర పోగుపడటం ఏ మాత్రం మంచిది కాదు. భారత్‌ను ప్రపంచంలోనే అత్యధిక వృద్ధి సాధిస్తున్న దేశంగా బీజేపీ నేతలు అభివర్ణిస్తారు. కానీ, గత పదేండ్లుగా దేశంలో పేదరికం తాండవిస్తున్నది. దేశంలోని అత్యంత ధనవంతులైన 0.4 మందిపై సంపద పన్ను వేస్తే.. సుమారు రూ.8 లక్షల కోట్లు సమకూరుతాయి. కానీ, ఆ పని చేయకుండా అదానీ లాంటి వారికి లబ్ధి చేకూర్చేలా ప్రధాని వ్యవహరిస్తున్నారు. పేదలు, మధ్యతరగతి ప్రజలపై కేంద్రప్రభుత్వం అత్యధికంగా పన్నుల భారం వేస్తున్నది. సంపన్నులు, కార్పొరేట్ కంపెనీలకు టాక్స్ రిబేట్లు ఇస్తూ సామాన్యులపై మాత్రం పరోక్షంగా పన్నులు బాదుతున్నారు.

2014లో ఎల్పీజీ సిలిండర్ ధర రూ.410 ఉండగా.. 2024 నాటికి అది 120 శాతం పెరిగి సుమారు రూ.900కు చేరింది. అలాగే పెట్రోల్ 37 శాతం, డీజిల్ 64 శాతం, వంటనూనె 60 శాతం, పాల ధరలు 71 శాతం పెరిగాయి. ఇలా పదేండ్లలో అన్ని ధరలు 50 శాతం కంటే ఎక్కువగానే పెరిగాయి. ఈ ధరల్ని భరించలేని పేద కుటుంబాలకు చెందిన పిల్లలు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. ఎన్డీయే పాలనలో సుమారు ఏడు కోట్ల మంది దారిద్ర్యరేఖ దిగువకు చేరుకున్నారు.

**మరోవైపు ఈ ప్రభుత్వ పాలనలో ఎస్సీ, ఎస్టీ వర్గాలపై దాడులు 48 శాతం పెరిగాయి. 2011లో చేయాల్సిన జనగణన పూర్తి చేయకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీలు, పేదలకు దక్కాల్సిన ప్రయోజనాల్ని తొక్కిపెడుతున్నారు. ఈ దశాబ్ద కాలంలో ప్రజాస్వామ్యాన్ని అంగట్లో సరుకుగా మార్చారు. అరుణాచల్‌ప్రదేశ్, గోవా, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, మణిపూర్‌లో ఎమ్మెల్యేల్ని కొనుగోలు చేసి, అక్రమ మార్గంలో అధికారాన్ని చేజిక్కించుకున్నారు.**

తమకు మద్దతివ్వని, తమ పార్టీలో చేరని ఎమ్మెల్యేలు, ఎంపీలపై సీబీఐ, ఈడీ దాడులు చేయించి, బెదిరించి మరీ బీజేపీలో చేరేలా ఒత్తిడి తెస్తున్నారు. 2014 తర్వాత ప్రతిపక్ష నేతలపై ఈడీ కేసుల శాతం ఎకాఎకీన 95 శాతం పెరగటమే అందుకు నిదర్శనం. దేశంలో సమాఖ్య స్ఫూర్తిని కాలరాసేలా వ్యవహరిస్తున్న మోదీ ప్రభుత్వం ప్రణాళిక సంఘాన్ని, జాతీయ అభివృద్ధి మండలిని రద్దు చేసింది. రాష్ట్రాలకు న్యాయంగా ఇవ్వాల్సిన వాటాను ఇవ్వకుండా, రాష్ట్రాలతో చర్చించకుండా నిధుల పంపిణీని చేపడుతున్నది. రాష్ట్రాలకు ఇవ్వాల్సిన పన్నుల వాటాను తప్పించుకోవటానికి అడ్డదారిలో సెస్సు, సర్‌చార్జ్‌లు విధిస్తున్నది. కాంగ్రెస్ పదేండ్ల పాలనతో పోలిస్తే మోదీ ప్రభుత్వంలో ఇలాంటి వాటి శాతం 15కు పెరిగింది. జీఎస్టీని ప్రవేశపెట్టిన బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాలకున్న స్వేచ్ఛను హరించింది. రాష్ట్రంలో విధించిన వస్తు సేవల పన్నును కేంద్రం నుంచి ఆడుక్కోవాల్సిన పరిస్థితిని తీసుకువచ్చారు. వివక్షాపూరితంగా వ్యవహరిస్తూ బీజేపీ పాలిత రాష్ట్రాలకు అధిక నిధులు కేటాయిస్తున్నారు. ఎన్నికల్లో డబులు ఇంజిన్ సర్కారు పేరిట ఓటర్లను మభ్యపెట్టాలని ప్రయత్నిస్తున్నారు. దీర్ఘకాల ప్రయోజనాల కోసం 'ఒకే దేశం- ఒకే ఎన్నిక' పేరిట సమాఖ్య స్ఫూర్తిని హరించేలా ఎత్తుగడలు వేస్తున్నారు. మతం పేరుతో ఓట్లు దండుకోవటానికి అలవాటు పడిన భారతీయ జనతా పార్టీ 2026లో జనగణన నిర్వహించి, ఆ తర్వాత పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన చేసి తమకు అనుకూలమైన రాష్ట్రాల్లో సీట్లు పెంచుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నది. ఒకవేళ ఇదే గనుక జరిగితే దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయి. హిందూత్వ పేరిట కేవలం ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, హర్యానా లాంటి రాష్ట్రాల్లో వచ్చే సీట్లతోనే కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని చూస్తున్నది. ఇదే జరిగితే దక్షిణాదితో పాటు ఈశాన్య రాష్ట్రాలకు పార్లమెంటులో ఎలాంటి ప్రాధాన్యం ఉండదు.

ఇప్పటికే ఎలక్టోరల్ బాండ్ల పేరుతో బీజేపీ చేసిన నిర్వాకం తెలిసిందే. కార్పొరేట్ సంస్థల్ని బెదిరించి వసూలు చేసిన వేల కోట్ల రూపాయల్ని ఆ పార్టీ ఎన్నికల్లో ఉపయోగించి అక్రమాలకు పాల్పడుతున్నది. చివరకు రాజ్యాంగాన్ని మార్చే లక్ష్యాన్ని బయటకు తీస్తున్నది. చరిత్రను మార్చటానికి ప్రయత్నిస్తున్న బీజేపీ దేశంలోని విద్యా వ్యవస్థను కాషాయీకరణ చేయాలన్న సంకల్పంతో పని చేస్తున్నది తప్ప, దేశం కోసం కాదనేది వాస్తవం.

(వ్యాసకర్త: బీఎన్ రావు ఫౌండేషన్ చైర్మన్)